క్లుప్తంగా

టౌన్ ఫీడర్ ఏర్పాటుకు శ్రీకారం



టౌన్ ఫీడర్ ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

కొయ్యలగూడెం: మండలంలోని కుంతల గూడెం గ్రామానికి టౌన్ ఫీడర్ ఏర్పాటు పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ పనులనుసర్పంచ్ పులి నాగరత్నం ప్రారంభించారు. ఆరిపాటి (కనకాద్రిపురం) నుంచి సుమారు నాలుగు కిలో మీటర్ల మేర విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. ఉపసర్పంచ్ రాజనాల జానకి రామాంజనేయులు, గెడ సత్యనారాయణ, విల్లూరి పట్టాభి రామారావు, దాసరి గంగ రాజు, పరిమి వెంకట రమేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

జంగారెడ్డిగూడెం: ఏలూరులో అమరజీవి పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన, డిబేట్, క్విజ్ పోటీలలో స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ విద్యార్థులు పాల్గొని ప్రతిభ చూపారని ఇన్‌చార్జి హెచ్ఎం ఎం విజయ ప్రకాష్ అన్నారు. వీరిని మంగళవారం పాఠశాలలో అభినందించామన్నారు.

మొక్కజొన్న పంటను ఆశిస్తున్న పురుగులు

జంగారెడ్డిగూడెం: మొక్కజొన్న పైరులో జింకు లోపం గుర్తించామని ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త కె.ఫణికుమార్ అన్నారు. మండలంలోని పేరంపేట, పంగిడిగూడెం, జంగారెడ్డిగూడెం ప్రాంతాల్లో మొక్కజొన్న పంటను ఆయన ఏఓ పోశారావుతో కలిసి మంగళవారం సందర్శించారు. మొక్కజొన్నను గులాబీ రంగు పురుగు, కత్తెర పురుగు ఆశించాయని, పంటలో జింకు లోపాన్ని కూడా గమనించామని తెలిపారు. గులాబీ రంగు పురుగు ఆశించిన మొక్కల మొవ్వు ఎండిపోతుందన్నారు. ఈ పురుగుల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, వాడాల్సిన మందులపై అవగాహన కల్పించారు.

అన్నదానానికి విరాళం

జంగారెడ్డిగూడెం: పారిజాతగిరి వేంకటేశ్వర స్వామి వారి నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన భక్తురాలు అడ్డగర్ల కస్తూరి లలిత సాహితి రూ.50,121 విరాళంగా మంగళవారం అందజేసినట్టు ఈఓ మానికల రాంబాబు తెలిపారు. తొలుత ఆమె తన కుటుంబ సభ్యులతో కలిసి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. దాత, కుటుంబసభ్యులకు స్వామి వారి శేషవస్త్రాలు, ప్రసాదాలు అందించిన వేదాశీర్వాదంతో సత్కరించారు.

సమస్యలపై వినతి

టి.నరసాపురం: టి.నరసాపురం మండల కేంద్రంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోరుతూ సామాజిక కార్యకర్తల ఎస్‌డీ నాసర్ పాషా మంగళవారం తహసీల్దార్ సాయిబాబా, ఎంపీడీఓ వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. టి.నరసాపురం ప్రధాన రహదారిలో దుమ్మూ ధూళిని నివారించాలని, గ్రామంలో అసంపూర్తిగా నిలిచిపోయిన మురుగునీటి కాలువల నిర్మాణం పూర్తి చేయాలని కోరారు. సయ్యద్ అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

చెత్త రిక్షాల అందజేత

జంగారెడ్డిగూడెం: పట్టణంలో పారిశుద్ధ్యం మెరుగుదలకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద చెత్త రిక్షాలను చైర్‌పర్సన్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ పట్టణంలో ఎక్కడా చెత్త నిల్వలు పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు చెత్తను సేకరించేందుకు 16 రిక్షాలను మున్సిపల్ సాధారణ నిధులు రూ.4 లక్షలతో కొనుగోలు చేశామని తెలిపారు. వైస్ చైర్మన్‌లు ముప్పిడి అంజి, కంచర్ల వాసవీ రత్నం, కమిషనర్ పాల్గొన్నారు.

ల్యాబ్ టెక్నీషియన్ల సాయం

జంగారెడ్డిగూడెం: ఇటీవల వెంకట్ అనే ల్యాబ్ టెక్నీషియన్ అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబానికి జంగారెడ్డిగూడెం అప్ ల్యాండ్ ఏరియా క్లినికల్ లేబరోటరీ అండ్ ఎక్సరే టెక్నిషియన్స్ యూనియన్ సభ్యులు రూ. 21 వేలు మంగళవారం అందజేశారు. యూనియన్ అధ్యక్షులు దాదా సాహెబ్, వైస్ ప్రెసిడెంట్ నరేంద్ర, ట్రెజరర్ ఆనంద్, సెక్రటరీ కిషోర్, జాయింట్ సెక్రటరీ చక్రి, సభ్యులు దుర్గారావు, రామకృష్ణ, మణికంఠ పాల్గొన్నారు.

అంజన్న సేవలో సినీ దర్శకుడు వంశీ



వంశీని సత్కరిస్తున్న అధికారులు

జంగారెడ్డిగూడెం: గురవాయిగూడెం మద్ది ఆంజనేయ స్వామిని ప్రముఖ సినీ దర్శకుడు వంశీ మంగళవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ మర్యాదలతో సిబ్బంది ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం వంశీకి అధికారులు ఆలయ ముఖ మండపంలో స్వామి వారి శేష వస్త్రాలతో సన్మానించి, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

మన్యంపై చలి పంజా

- పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- ఉదయం దట్టమైన పొగమంచు
- మధ్యాహ్నం కూడా వీస్తున్న చలి గాలులు

బుట్టాయగూడెం: పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలో చలి పులి పంజా విసురుతుంది. గత కొద్ది రోజులుగా తీవ్రమైన చలిగాలులు వీస్తున్నాయి. తుపాను ప్రభావంతో మధ్యాహ్న సమయంలో కూడా చలి గాలులు తీవ్రంగా వీస్తున్నాయి. సాయంత్రం నాలుగు గంటల నుంచే చలి గాలులు ప్రజలను వణికిస్తున్నాయి. రాత్రి సమయంలో చలి గాలులు మరింత తీవ్రంగా వీస్తున్నాయి. ఇప్పుడే పరిస్థితి ఈ విధంగా ఉంటే జనవరి నెలలో చలి తీవ్రత ఎలా ఉంటుందో అని గిరిజన ప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అర్ధరాత్రి నుంచి మొదలవుతున్న పొగ మంచు ఉదయం తొమ్మిది గంటల వరకు తగ్గడంలేదు. ఉదయం, సాయంత్ర సమయాల్లో బయటకు రావాలంటే ప్రజలు చలికి భయపడిపోతున్నారు. అత్యవసరమైతే తప్ప ఇళ్లల్లో నుంచి బయటకు రావడంలేదు. గత కొద్దిరోజులుగా ఏజెన్సీ ప్రాంతంలో వీస్తున్న చల్లని గాలులు వల్ల రోజురోజుకూ ఉష్ణోగ్రతలు తగ్గుతున్నాయి. గ్రామాల్లో చలి తట్టుకోలేక రాత్రి, ఉదయం పూట ప్రజలు చలి మంటలు వేసుకుని చలి నుంచి ఉపశమనం పొందుతున్నారు. స్వెటర్లు, మంకీ క్యాప్‌లు ధరిస్తూ చలి నుంచి కాపాడుకుంటున్నారు. ఉదయం పూట బయట ప్రాంతంలో 17 డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదు కాగా, కొండప్రాంతాల్లో 15 నుంచి 14 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.

కమ్మేసిన దట్టమైన పొగమంచు →





అలివేరులో చలి మంట వేసిన గిరిజనులు

ఎక్కువైన చలి తీవ్రత



ఏజెన్సీ ప్రాంతంలో ఇటీవల చలి తీవ్రత పెరిగింది. దట్టమైన మంచు కురుస్తుంది. రాత్రి వేళలతోపాటు వేకువ జామున కూడా తీవ్రమైన పొగమంచు కురవడంతో వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. ఉదయం 10 గంటలు దాటే వరకూ మంచు తెరలు వీడటంలేదు. చలి నుంచి రక్షించుకోవడానికి ఉదయం, సాయంత్రం కూడా చలిమంటలు కాగుతున్నాం.

– కారం వాసు, ఎర్రాయిగూడెం, బుట్టాయగూడెం మండలం

సువర్చల సమేత హనుమద్ ఉత్సవం



హనుమాన్ చాలీసా పఠనం చేస్తున్న భక్తులు

కొయ్యలగూడెం: హనుమద్ వ్రత ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు మంగళవారం ఆంజనేయ స్వామి ఆలయాల వద్ద సువర్చల సమేత హనుమద్ ఊరేగింపులు, అన్న సమారాధనలు ఘనంగా నిర్వహించారు. సరిపల్లి సమీపంలోని సంజీవ అంజనేయస్వామి ఆలయం వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు 108 సార్లు 108 మంది మహిళా భక్తులు హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. అలయ ధర్మకర్త మండలికి చెందిన మిరియాల వంశీయులు మూడు వేల మందికి పైగా భక్తులకు భారీ అన్నసమారాధన ఏర్పాటుచేశారు. అంకాలగూడెం లోని పోలవరం రోడ్డులో ఉన్న ఆంజనేయస్వామి ఆలయం వద్ద అన్న సమారాధన నిర్వహించారు. ప్రఖ్యాతిగాంచిన ఆరిపాటి ఆలయంతో పాటు మండలంలోని అంజనేయస్వామి ఆలయాల్లో ముగింపు వేడుకలు నిర్వహించారు.

పట్టణాభివృద్ధికి సమష్టి కృషి

మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి

జంగారెడ్డిగూడెం: పట్టణాభివృద్ధికి అందరూ సమష్టిగా కృషిచేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన కౌన్సిల్ సాధారణ సమావేశానికి లక్ష్మి అధ్యక్షత వహించారు. సభ్యులు పలు సమస్యలను వివరించారు. వైస్ చైర్మన్లు ముప్పిడి అంజి, కంచర్ల వాసవీ రత్నం తదితరులు మాట్లాడారు. స్థానిక నాలుగో సచివాలయం ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహిస్తుడడంతో ఎస్సీల కార్యక్రమాలు నిర్వహణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, సచివాలయాన్ని వేరే ప్రాంతానికి మార్చాలని కోరారు. పట్టణంలో వీధి లైట్లు సరిగా పనిచేయక దొంగతనాలు, చైన్ స్నాచింగ్‌లకు ఆస్కారం ఏర్పడిందని, అధికారులు వీధిలైట్లు సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మూడో వార్డులో మంచినీటి సమస్య పరిష్కరించాలని కౌన్సిలర్ రమాదేవి, 10వ వార్డులో నిర్మించిన ఏపీహెచ్‌సీ భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని, శానిటేషన్ సిబ్బంది కొరత లేకుండా చూడాలని కౌన్సిలర్ జ్యోతి కోరారు. పట్టణంలో డ్రెయిన్లలో పూడిక తీయించాలని, కుక్కల బెడదను అరికట్టాలని కాసర తులసీ రెడ్డి కోరారు. 1వ వార్డులో మంచినీరు, పైప్‌లైన్‌లు, వీధిలైట్లు సమస్య పరిష్కరించాలని కౌన్సిలర్ ముప్పన రమణ కోరారు. టౌన్‌హాల్ సమీపంలోని అనధికార లేఅవుట్లపై ఏం చర్యలు తీసుకున్నారో చెప్పాలని కౌన్సిలర్ దొంతు మాధవ ప్రశ్నించారు. ఆ లేఅవుట్‌కు అనుమతి ఇవ్వలేదని కమిషనర్ వివరించారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి వివిధ రంగాల్లో ఇక్కడే పనిచేస్తున్న వారి సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. పట్టణంలో పెండింగ్‌లో ఉన్న వివిధ అభివృద్ధి పనులపై చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్ చిటికెల అచ్చిరాజు కోరారు. డిగ్రీ కళాశాల సమీపంలో ఉన్న మంచినీటి ట్యాంక్ జనరేటర్ రిపేర్ చేయించాలన్నారు. పట్టణంలోని సమస్యలు పరిష్కరిస్తామని చైర్‌పర్సన్ లక్ష్మి, కమిషనర్ కేవీ రమణలు తెలిపారు. సమావేశంలో ఆయా శాఖల అధికారులు, సిబ్బంది, కౌన్సిలర్లు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి , సమావేశంలో పాల్గొన్న కౌన్సిల్ సభ్యులు

చేపల పెంపకంతో సాగునీటి కొరత



రాయుడు చెరువు వద్ద సమావేశమైన రైతులు

కొయ్యలగూడెం: మండలంలోని బోడిగూడెం గ్రామ శివారు రాయుడు చెరువును చేపల పెంపకానికి లీజుకు ఇవ్వడంతో రెండో పంటకు నీరు సరిపోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ చెరువు ద్వారా రబీ సీజన్‌కి కూడా నీరు సరఫరా అయ్యే విధంగా ఇరిగేషన్ శాఖ కృషి చేయాలని కోరారు. రాయుడు చెరువు ఆయకట్టుదారులు మంగళవారం సమావేశమయ్యారు. 18 ఎకరాల గర్భం గల చెరువు ద్వారా దాదాపు 40 ఎకరాల వరకు సాగునీరు అందుతోందన్నారు. ఫిబ్రవరి నుంచి చేపల పెంపకం లీజుదారుడు నీరును వదిలి వేయడం వల్ల పంటకు సరిపోవడంలేదని, పశువులకు దాహార్తి సమస్య ఏర్పడుతుందని వివరించారు. సమస్యను ఇరిగేషన్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా ఒక పంటకు మాత్రమే నీరు సరఫరా అయ్యేవిధంగా నిబంధనలు ఉన్నట్టు చెబుతున్నారని తెలిపారు. చెరువుల నీరు సాగు అవసరాలకు, రజక వృత్తికి మాత్రమే ఉపయోగించే విధంగా పంచాయతీ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యపై ఇప్పటికే ఏలూరు కలెక్టరేట్లో వినతి పత్రం అందజేశామని రైతు మిరియాల మనోహర్ తెలిపారు. 70 ఏళ్ల క్రితం మూడు వర్గాలకు చెందిన రైతులకు మాన్యాలు పేరిట వ్యవసాయ భూములను ప్రభుత్వం ఇచ్చిందని, అప్పటి నుంచి సాగు చేసుకుంటుండగా చేపల పెంపకం పేరిట చెరువులో నీరు లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. పైగా లీజుదారుడు రైతులను హెచ్చరించే విధంగా గ్రామంలో టాంటాం వేయించాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో జక్కు ధర్మరాజు, జక్కు చెల్లారావు, చదలవాడ అబ్రహాం, చిడిపి వెంకన్నబాబు, జక్కు రామ దుర్గారావు, బోగోలు వెంకన్న, రాఊరి రామలక్ష్మి, జక్కు సుబ్బలక్ష్మి, బోగోలు రామలక్ష్మి, పేరుబోయిన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితేనే ఫలితం

చింతలపూడి : కష్టపడి చదివితేనే ఫలితం ఉంటుందని జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటలక్ష్మమ్మ విద్యార్థులకు సూచించారు. చింతలపూడి మండలం రేచర్ల గ్రామంలో ఎంపీయూపీ పాఠశాలను మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. చదువుతో పాటు సాంకేతిక నైపుణ్యాలు నేర్చుకోవాలని సూచించారు. ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని నిరంతరం సాధన చేయాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా డీఈఓ పాఠశాలలో రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజనంపై విద్యార్థులను ఆరా తీశారు. వంట గదిని పరిశీలించారు. భోజనం మెనూ వివరాలను ప్రధానోపాధ్యాయులు ఎంఎస్ రాజేంద్రని, ఉపాధ్యా యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీఈఓ విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. తొలుత రేచర్ల గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ కిరణ్ బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రేచర్ల ఎంపీయూపీ పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న డీఈఓ వెంకట లక్ష్మమ్మ

ఘనంగా పెన్షనర్స్ డే

జంగారెడ్డిగూడెం: స్థానిక పెన్షనర్స్ భవనంలో మంగళవారం జాతీయ పెన్షనర్స్ డే కార్యక్రమం ఏపీ స్టేట్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జంగారెడ్డిగూడెం అధ్యక్షులు ఎస్ రాధాకృష్ణ, కార్యదర్శి కె.నాగేశ్వరరావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఏటీఓ చంద్రయ్య పాల్గొని మాట్లాడారు. ప్రతి పెన్షనర్ తమ సమస్యలను తన దృష్టికి తెస్తే పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. ఎస్‌టీఓ ఎస్ చినబాబు మాట్లాడుతూ ఫామిలీ పెన్షన్ విధానాన్ని వివరించారు. ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ ఎ.రాజేష్ పెన్షనర్స్‌కు బ్యాంకు ద్వారా అందిస్తున్న సదుపాయాలను వివరించారు. రామచంద్ర మ్యాక్ సొసైటీ చైర్మన్ బీవీ కృష్ణారావు మాట్లాడుతూ సొసైటీ ద్వారా పెన్షనర్స్‌కు అందిస్తున్న సేవలను తెలిపారు. అనంతరం రిటైర్డ్ ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సభ్యులు ఎం అయ్యన్న, ఎల్ రఘురామ్, కె.బాలకృష్ణ, ఎ.శిఖామణి, ఎస్‌కేజకీరా, కె.త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెంలో పెన్షనర్స్ డే కార్యక్రమం

అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు

కామవరపుకోట: పాడి రైతులకు ఇచ్చే మినీ గోకులాల నిర్మాణంలో అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని చింతలపూడి ఏపీడీ కె.పురుషోత్తం తెలిపారు. మండలంలో ప్రభుత్వం పాడి రైతులకు ఇచ్చే మినీ గోకులం పథకంలో అవినీతి జరిగిందనే అభియోగాలపై మంగళవారం స్థానిక ఎన్ఆర్‌జీఎస్ కార్యాలయంలో ఆయన రికార్డులు పరిశీలించి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 31 యూనిట్ పనులను ప్రారంభించడం జరిగిందని, మినీ గోకుల నిర్మాణాల్లో ఏ విధమైన అవినీతి, అక్రమాలు జరిగిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని, దీనిపై విచారణ చేసి ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు. అయితే ఇటీవల మినీ గోకుల పథకం అమలులో మండలంలో అవినీతి జరిగిందని, అధికారులు కాసులకు కక్కుర్తి పడి ఈ పథకానికి అర్హులైన వారిని ఎంపిక చేయకుండా, టీడీపీ నాయకులైన బినామీలకు మంజూరు చేసి అధికారులు పైసలు దండుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



ఎనర్జీస్ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏపీడీ పురుషోత్తం

నేటి నుంచి గ్రామాల్లో సామాజిక తనిఖీలు



సమావేశంలో మాట్లాడుతున్న అధికారి

ద్వారకాతిరుమల: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై మండలంలోని గ్రామాల్లో బుధవారం నుంచి విడతల వారీగా సామాజిక తనిఖీలు నిర్వహించనున్నట్టు ఆ పథకం జిల్లా విజిలెన్స్ అధికారి కె.పురుషోత్తం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం తనిఖీ బృందంతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పురుషోత్తం మాట్లాడుతూ సిబ్బంది సమన్వయంతో 16వ విడత సామాజిక తనిఖీలను పటిష్టంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో ఈఓపీ ఆర్డీ ఏవీ సుబ్బరాయన్, సోషల్ ఆడిట్ స్టేట్ రిసోర్స్ పర్సన్ టి.నందిని, సోషల్ ఆడిట్ డీఆర్పీలు, మండలం ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

జనం లేక రెవెన్యూ సదస్సు వెలవెల

టి.నరసాపురం: మండలంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులకు ఆదరణ కరువైంది. జనంలేక వెలవెలబోతున్నాయి. భారీగా ప్రజలు వస్తారని భావించి చేసిన ఏర్పాట్లు తుస్సుమంటున్నాయి. సరైన ప్రచారం లేకపోవడంతో ప్రజలు పెద్దగా రాకపోవడంతో ఖాళీ కుర్చీలు దర్శనమిస్తున్నాయి. జిల్లాలోనే భూ వివాదాలు ఎక్కువగా ఉన్న మండలం, భూ వివాదాలపై కోర్టు కేసులు ఎక్కువగా ఉన్న మండలం టి.నరసాపురం మండలం అనే గుర్తింపు ఉంది. ఈ మండలంలోనే భూ సమస్యలను పరిష్కరించే దిశగా నిర్వహించిన రెవెన్యూ సదస్సులకు ఎవరూ ఆసక్తి చూపించకపోవడం ప్రచార లోపమేనని పలువురు విమర్శిస్తున్నారు. దీనిపై తహసీల్దార్ టి.సాయిబాబను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన ఫోన్‌కు అందుబాటులోకి రాలేదు. మండల కేంద్రమైన టి.నరసాపురంలో సచివాలయం వద్ద తహసీల్దార్ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించిన రెవెన్యూ సదస్సులో మొత్తం 15 అర్జీలు వచ్చినట్టు అధికారులు తెలిపారు. ఆన్‌లైన్ రికార్డుల్లో నమోదు కోసం, 22ఏ నిషేధ జాబితా నుంచి తొలగింపు కోసం, సర్వే కోసం ప్రజలు అర్జీలు అందజేశారని పేర్కొన్నారు.



టి.నరసాపురంలో సదస్సులో జనంలేక ఖాళీగా కుర్చీలు

భూ సమస్యలకు పరిష్కారం

చింతలపూడి : రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలను పరిష్కరించుకోవాలని తహసీల్దార్ డీఎల్ ప్రమద్వర అన్నారు. చింతలపూడి మండలం రేచర్ల గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆమె మాట్లాడారు. భూ సంబంధిత రెవెన్యూ రికార్డుల్లో తప్పులున్నా, సర్వే, రీ సర్వే, పుంత దారి ఆక్రమణలు తదితర సమస్యలకు సదస్సుల ద్వారా పరిష్కారం లభిస్తుందని వివరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కె.శివరామకృష్ణ, కంచర్ల శ్రీనివాసరావు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.



రెవెన్యూ సదస్సులో సమస్యలను అధికారులకు వివరిస్తున్న గ్రామస్తులు

ఈ-పంట నమోదుతో మేలు

టి.నరసాపురం: రైతులు ఈ-పంట నమోదు చేయించుకోవడం ద్వారా ప్రభుత్వం అందించే పథకాల లబ్ధి పొందవచ్చని ఏఓ బి.సుమలత తెలిపారు. బండివారిగూడెం, అప్పలరాజుగూడెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమలత మాట్లాడుతూ రబీ సీజన్‌లో పొగాకు, మొక్కజొన్న, వేరుశెనగ సాగు చేసే రైతులు ఈ-పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. మొక్కజొన్న సాగుచేసే రైతులు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకంలో బీమా ప్రీమియం ఎకరానికి రూ.483 డిసెంబర్ 31వ తేదీలోగా చెల్లించాలన్నారు.

నిర్వాసితులకు ఉపాధి కల్పించాలి

బుట్టాయగూడెం: పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల ముంపుకు గురవుతున్న గ్రామాల్లో నివసిస్తున్న నిర్వాసిత కూలీలకు ప్రభుత్వం ఉపాధి కల్పించాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అందుగుల ఫ్రాన్సిస్ కోరారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. నిర్వాసితులకు భూమికి భూమి, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలు ఇస్తామని ప్రభుత్వం చెప్తున్నప్పటికీ ఎటువంటి జీవనాధారంలేని కూలీలకు ఉపాధి కల్పనపై ఎటువంటి ప్రకటన చేయకపోవడం బాధాకరమని అన్నారు. కూలి పనులకు వెళ్తేకాని జీవనం సాగించలేని కూలీలు ప్రస్తుతం హోటళ్లలో, బట్టల షాపుల్లో పనిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం కూలీలకు కూడా రూ.10 లక్షల వరకు పరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. నిర్వాసితుల్లో కూలీల్లో ఎక్కువగా దళితులు, గిరిజనులే ఉన్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం నిర్వాసితులకు ఉపాధి కల్పించకపోతే రాబోయే రోజుల్లో ఉద్యమాలు చేస్తామని అన్నారు.

బెదిరింపులపై కేసు

జంగారెడ్డిగూడెం: ఒక వ్యక్తిని కొట్టి గాయపర్చి, చంపుతానని బెదిరించిన నలుగురిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. పంగిడిగూడెంకు చెందిన కుంచే కృష్ణకు అదే గ్రామానికి చెందిన కుంచె మోహన్‌రావుకు పాత గొడవలు ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 14న కుంచే కృష్ణ మోటార్ సైకిల్‌పై వెళుతుండగా, కుంచె మోహన్‌రావు మరో ముగ్గురు కలిసి కృష్ణను ఆపి కొట్టి గాయపర్చారని తెలిపారు. కృష్ణ ఇంటికి వెళ్లి ఇంట్లోని సామగ్రిని ధ్వంసం చేసి, అతని భార్యను చంపుతానని బెదిరించారని పేర్కొన్నారు. గాయపడిన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు, ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు ఎస్సై తెలిపారు.

ఆరుగురిపై కేసు

జంగారెడ్డిగూడెం: ఇంటి సరిహద్దు గొడవల నేపథ్యంలో ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశామని ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. జంగారెడ్డిగూడెంకు చెందిన మిద్దే నాగ సత్యవీర్రాజుకు, పఠాన్ ఖాన్‌కు ఇంటి సరిహద్దు విషయంలో గొడవలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 15న ఉదయం పఠాన్ ఖాన్, మరో ఐదుగురు వీర్రాజు ఇంట్లోకి ప్రవేశించి వీర్రాజు, అతని తల్లిని కొట్టి గాయపర్చారని తెలిపారు. వీర్రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

చింతలపూడి : స్థానిక ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధి గ్రామాల్లోని సారా స్థావరాలపై ఎక్సైజ్ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. నాగిరెడ్డిగూడెంకు చెందిన బొల్లవరపు మోహనరావు అనే వ్యకిని అరెస్ట్ చేసి, రెండు లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామని సీఐ పి.అశోక్ తెలిపారు. లింగపాలెం మండలం వెస్ట్ యడవల్లిలో సారా తయారీకి సిద్ధం చేసిన 300 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సైలు ఆర్‌వీఎల్ నరసింహారావు, అబ్దుల్ ఖలీల్, సిబ్బంది పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధి సాధించాలి



శిక్షణలో పాల్గొన్న సర్పంచ్‌లు, కార్యదర్శులు

బుట్టాయగూడెం: గ్రామాల్లో సుస్థిర అభివృద్ధి సాధించే దిశగా గ్రామ పంచాయతీలు పనిచేయాలని ఎంపీడీఓ కుంజా జ్యోతి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై నిర్వహించిన కార్యక్రమంలో శిక్షణలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో సుస్థిర అభివృద్ధి సాధించేందుకు అన్ని ప్రభుత్వ శాఖలతో సమన్వయం కోసం వివిధ శిక్షణలు క్షేత్రస్థాయిలో నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో మండలంలోని సర్పంచ్‌లు వెలుగు సిబ్బంది, కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.